


రాంబాబు నాకు టెలిగ్రామ్ ఇచ్చాడు.... వెంటనే బయలుదేరి రమ్మంటూ.

రాంబాబు నాకు చిన్ననాటి స్నేహితుడు. ఇద్దరం కలిసే చదువుకున్నాం. ఇప్పుడూ కలిసే పని చేస్తున్నవాళ్లం. వాడు టెలిగ్రామ్ ఇచ్చాడు అంటే అత్యంత అవసరం అయి ఉండాలి. తప్పదు, సెలవు పెట్టి బయలుదేరాను. రాంబాబు కోసం మాత్రమే అని అనను. బయలుదేరింది మా ఊరికి - అన్నట్లు రాంబాబుదీ, మాదీ ఒకటే ఊరు.

బస్సులో కూర్చున్న తరువాత అలా బస్సంతా ఒకసారి కలియజూశాను. నా పక్కసీట్లో ఒకతను, అతని పక్కనే ఒక యువతి - అడిగిన దానికంతా బహుశ్రద్ధగా, ఓపికగా జవాబులిస్తున్న దాన్ని బట్టి అతని భార్యే అయి ఉంటుందనిపిస్తోంది.

నేను అటుకేసి చూడటం అతను గ్రహించి, నాకేసి చూశాడు. దోషిలాగే తల దించుకున్నాను.

వాళ్ల ఇద్దరి గురించిన ఆలోచనలు ఇంకా సరిగా నన్ను ముసరకమునుపే, బస్సు ఆగిపోయింది. డ్రైవరు హారన్ మోగిస్తున్నాడు. ఏమిటా అని చూశాను.

రెండు పాములు - బాగా పెద్దవి - ఒకదానికొకటి పెనవేసుకుని రోడ్డుకడ్డంగా ఉన్నాయి. బాగా మత్తులో ఉన్నాయేమో త్వరగా కదలటం లేదు.

హారన్, హారన్, హారన్. వాటిలో చలనం లేకపోలేదు. కానీ, అది తక్కువ. డ్రైవర్ హారన్ మోగించటం మానేశాడు.

నా పక్కనున్నతను అన్నాడు: "ఎంతసేపిలా ఇక్కడ?"

డ్రైవర్ ఒకసారి వెనక్కు తిరిగి చూశాడేకానీ, సమాధానం ఇవ్వలేదు.

మళ్లీ అతనే అన్నాడు విసుగ్గా: "అవి కదలకపోతే, మీదనుంచి తీసుకెళ్లండి."

ఈ మాటలకూ ఆ పాములు కదలలేదు. అయితేనేం? డ్రైవర్ కదిలాడు.

"అవి త్రాచుపాము, జెర్రిగొడ్డు. అవి పగపడితే ఇంకేమైనా ఉందా?"

నిజమే, పాము పగ పట్టవచ్చు. అయినా, నాకు ఆశ్చర్యంగానే ఉంది.... పగలతో, కక్షలతో అణువణువూ నిండిపోయిన వీళ్ళుకూడా పాముల పగ గురించి ఆలోచిస్తూ, పాముల గురించి భయపడటం చూస్తూంటే!

మనిషిని మించిన పాము లేదు! మనసును మించిన పాము లేదు!!

పగపడితే మనిషి పట్టాలి. కాటువేస్తే మనసు కాటు వెయ్యాలి. అంతేగానీ తాచుపాము, జెర్రిగొడ్డు పగ... ఇదంతా మనుషుల ముందు తీసికట్టే!

అన్నట్లు ఇప్పుడు గుర్తు వస్తోంది - నాకూ, రామానికి పరిచయం అయింది కూడా ఇలాంటి దృశ్యం దగ్గరే.

'పాములొచ్చాయ్, పాములొచ్చాయ్' అంటున్న కేకలు విని పరుగెట్టాను నేను, అమ్మ వద్దంటున్నా వినక. పాముల వాడేమోననుకున్న నేను, ఆ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాను. రాయుడుగారింటి ముందు రెండు పెద్దపాములు మెలి తిరుగుతూ ఉన్నాయి. పాములు చూడ్డానికి భయంగా ఉన్నా, అవి వాటి ధోరణిలో ఉండడంతో ధైర్యంగా అక్కడే ఉన్నాం. గోల విన్నట్లుంది, రాయుడుగారు బయటికొచ్చారు. రావటం తడవుగా వీరిగాణ్ణి పిలిచారు.

"వీరిగా! చూస్తావేంరా! చంపి అవతల పారేయక!"

"వద్దు, నాన్నా, వాటిని చంపద్దు" అంటున్న అబ్బాయిని, "నువ్వూరుకో" అంటున్న రాయుడుగార్నీ చూశాను నేను. వీరిగాడు రెండు క్షణాల్లో రెండు పాముల్నీ చంపేయటమూ చూశాను. ఆ రెంటినీ జతగా కాల్చటమూ చూశాను.

మర్నాడు ఆ అబ్బాయికి తీవ్రంగా జ్వరం వచ్చింది. 'పాముల్ని చంపద్దు, నాన్నా' అన్న కలవరింతలతో దాదాపు రెండు రోజులు ఆ అబ్బాయి అలాగే ఉన్నాడు. "మంచి మనసున్న వాళ్ళే అలా బాధపడతార్రా!" అన్న అమ్మ మాటలే ఆ అబ్బాయికి, నాకూ స్నేహం కలిపాయి. అదుగో, అతని పేరే రాంబాబు!

తర్వాత అతనితోటే తిరగటం, చదవటం, గొడవలు పడటం, తిరిగి కలుసుకోవటం... అదంతా వేరే కథ!

ఆలోచిస్తూ ఎప్పుడు పడుకున్నానో ఏమో, తెలతెలవారుతూంటే మెలుకువ వచ్చింది. టైమ్ చూసుకొన్నాను నేను. నాలుగూనలభై. ఇంకో అరగంటలో జంక్షన్ దగ్గర దిగితే, ఆ తర్వాత ఒక గంట నడక. ఆరున్నరకు ఇంట్లో ఉంటాను.

అనుకున్నట్లుగా ఆరున్నరకు రాయుడుగారింట్ల ఉన్నాను నేను. వెళ్ళేసరికి ఇంటిముందు ఎవరూ లేరు.

"రాంబాబూ! రాంబాబూ!!"

గట్టిగా పిలిచానేమో, పక్కగదిలోంచి ఏదో వినిపించింది. అది రాయుడు గారి కంఠం. సంచీ నడవలో ఉంచి ఆ గదిలోకి వెళ్ళాను. రాయుడుగారు మంచం మీద పవళింపుసేవలో ఉన్నారు.

"బాబాయ్‌గారూ!"

కళ్ళు తెరిచారు రాయుడుగారు. నాకేసి చూసి నవ్వారు. "నువ్వా? రారా! రాముడేమోననుకున్నా!"

దగ్గరగా వెళ్ళాను. చాలా కాలం అయింది ఆయన్ని చూసి. నా మనసెందుకో సంతోషపడింది. "రాంబాబేదండి?"

"రాంబాబా? ఏమే, పారూ, రాముడేడి?" అడిగారాయన భార్యనుద్దేశిస్తూ. ఇంతలో ఆయనకే గుర్తొచ్చిందేమో "ఆ, అన్నట్లు శాస్త్రుల దగ్గరికెళ్ళాడు" అన్నారు.

"ఏ శాస్త్రి?"

"అదేనయ్యా, కృష్ణయ్య లేడూ, పౌరోహిత్యపు బ్రాహ్మడు. ఆయన దగ్గరకు. రేపేగా మరి ముహూర్తం? దానికోసం ఏదో కనుక్కురమ్మంటేనూ...."

"ఏమిటండీ ముహూర్తం?" అని అడుగుదామనుకున్నాగానీ, ముహూర్తం అని శుభవార్త చెబుతూంటే ఏమిటి అని అడగటం భావ్యంకాదు.

కానీ, ఈ ఇంటిలో పెళ్ళికళ లేదు. ఆ మామిడి తోరణాలు, ఆ కొబ్బరి ఆకుల పందిళ్ళు - అవి లేకపోతే అసలు కళ్యాణ మంటపం శోభే కానరాదు.

అయినా, ఇదేమిటి? రాంబాబు పెళ్లా? నాకు తెలీకుండానే! కాదు, అయి ఉండదు.

"అయినా, అడగటం మరిచిపోయాను. కులాసాయేనా?" ఆలస్యంగానైనా కుశల ప్రశ్న కుశల ప్రశ్నే.

నవ్వాను నేను.

ఇంతలో రాంబాబు రానే వచ్చాడు. నన్ను చూసివాడి ముఖం చేటంత అయింది. కాదూ మరి, వాడి ప్రాణానికి ప్రాణం నేను. దగ్గరగా వెళ్ళి అన్నాను "కంగ్రాచ్యులేషన్స్‌రా!"

వాడొకసారి ఆశ్చర్యపోయాను. "ఎందుకురా?"

వీడుత్త వెధవ. నానోటి నుంచి చెప్పించాలనేకానీ, వీడికి మాత్రం తెలీదనా? అదే అన్నాను.

నవ్వేశాడు. "నే కాదురా వెధవను! నువ్వు! ముహూర్తం నే వేయాల్సిన మూడు ముళ్లకోసం కాదోయ్, మేము మొదలు పెడుతున్న బావిపని కోసం!!"

నా ఆశ అంతా అణుగారిపోయింది. బావికోసమా వీడిచ్చిన టెలిగ్రామ్! వీడు మరీ ఒళ్ళుపొగరుతో కొట్టుకుంటున్నాడు.

నాలో నేనే గొణుక్కోవడం చూసి రాంబాబు నవ్వుకున్నాడు. నాకు చిర్రెత్తుకొచ్చింది.

"ఏమన్నాడురా శాస్త్రి?" రాయుడిగారి ప్రశ్న.

"శాస్త్రిగారా?" క్షణం ఆగి అన్నాడు రాంబాబు. "రేప్పొద్దున్న తొమ్మిది పదికి బాగుందట. ఆ సమయానికి అంతా సిద్ధం చేయించి పెట్టమన్నాడు".

"మరయితే అలాగే నిలబడ్డావేంరా? వెళ్ళు... వెళ్ళి కోటిగాడికి, వీరిగాడికీ చెప్పు. రేప్పొద్దున్నే ఇద్దర్నీ సిద్ధమయి రమ్మను. సరేనా? తర్వాత, అన్నట్లు వీరిగాడిని ఈ వేళ సాయంత్రమే రమ్మన్నానని చెప్పు. అలాగే శాస్త్రినీ!"

మౌనంగా తల ఊపాడు రాంబాబు. నాకేసి చూసి అన్నాడు "బయటకు వెడదాం. వస్తావేమిట్రా?"

"పద" అన్నాన్నేను.

రాంబాబూ, నేను - ఇద్దరమూ బయటకు నడిచాము. పొలంగట్టుమీదకు రాగానే అడిగాను నేనే: "ఇటెక్కడికిరా?"

"కోటిగాడింటికి... సరేగానీ, మా బావి చూస్తావేమిట్రా?"

తల ఊపాను సరేనన్నట్లు. రెండు మూడు అడుగులలోనే చూపించాడు ఒక పెద్ద గొయ్యిని. ఆశ్చర్యపోయాను. "అదేమిట్రా, బావిని మొదలు పెడుతున్నారు అన్నావుగా?"

"మొదలు పెట్టడం జరిగి రెండేళ్లయిందిరా! వెంటనే, ఇదిగో ఈ రాయి రావటంతో ఇక నీళ్లు పడవని పని మానేశారు. మళ్ళీ ఇప్పుడు ఇన్నాళ్లకు..."

"ఇప్పుడు పడతాయని గ్యారంటీయా?"

"గ్యారంటీయా అంటే కాదనే అనాలి. అయినా, ఆ శాస్త్రిగారి పూజామహిమవల్ల నీళ్లు పడవచ్చు."

నవ్వాడు రాంబాబు.

నాకు నవ్వు రాలేదు. ఏడుపొచ్చింది. శాస్త్రిగారి మహిమవల్ల నీళ్లొస్తే ఇంకేం కావాలి? మంత్రాలకే చింతకాయలు రాలగలిగితే ఇంకా ఏం కోరాలి? ఇదంతా రబ్బిష్! ఈ శాస్త్రికీ బుర్రలేదు, ఈ రాయుడికీ లేదు.

మరి రాంబాబు మాటో? అడిగాను వాణ్ణి. వాడిదగ్గరి నుంచి జవాబు రాబట్టుకోలేకపోయాను. వెనుదిరిగి కోటిగాడింటికి వెళ్ళాను. మమ్మల్ని చూసి వాడు బయటకు వచ్చాడు, నమస్కారమంటూ.

నల్లగా, మోటుగా కండలపోవులా ఉన్నాడు. మనిషికున్న ఆ కండలకు అందాన్ని చేకూరుస్తూ ఆ నూనూగు మీసాలు. రౌడి రంగడులా ఉన్నాడు. నాకు ముచ్చటవేసింది. దేశమంతా ఇంత ఆరోగ్యవంతులు ఉంటే ఎంత బాగుండేది!

"ఒరే, రేపేరా పని మొదలు పెట్టేది. తొమ్మిదికి - సరేనా?"

వాడు తల ఊపాడు. "సాయంత్రం వచ్చి ఒకసారి కనిపించి తీరతానండి. పై పన్లూ అవీ ఈ వేళే చేసేస్తే సరి!"

రాంబాబు క్షణం ఆగి అన్నాడు: "కోటిగా! ఒక పని చేస్తావురా?"

"చెప్పండి, బాబయ్యా!" వాడి పలుకుల్లో వీడిపట్ల, వీడి పనిపట్ల వాడికున్న గౌరవం వెల్లడవుతోంది. యజమాని అంటే ఇంత భక్తి ఉన్నవాళ్లు అరుదుగా ఉంటారేమో!

"ఇవిగో, ఈ పదిరూపాయలూ తీసుకో. పట్నంపో! ఎల్లుండి పొద్దున్న వరకు ఈ ఊరి ఛాయల్లో కనపడితే మక్కెలిరగ తంతా!"

కోటిగాడు నవ్వేశాడు. "మా బాగా చెప్పారండి! రేపే పూజన్నారు. ఎల్లుండి రమ్మంటే ఎల్లాగండీ! అయ్యగారికి తెలిస్తే చంపేయరా?"

"నిన్నేం చంపరు లేవోయ్. నువ్వు నా మాట విని వెళ్ళిపో, రేపు రాతిమీద దెబ్బ వెయ్యమని నిన్నే అడుగుతార్రా!"

వాడి కళ్లు ఆనందంతో మెరిశాయి. "నిజంగానాండీ? అయితే, అసలెళ్ల కూడదండీ. అంతపనీ నాదే నన్నమాట."

"అలా కాదురా..." రాంబాబు అంటున్నది నేను వినిపించుకోలేదు. వీడి తత్త్వం నాకర్థం కావటంలేదు. రాయిమీద దెబ్బ వెయ్యవలసింది కోటిగాడు. అయినా, వాణ్ణి పట్నం పో అనికూడా అంటున్నాడు. వీడి కసలు బుర్ర ఉన్నట్లు లేదు. వాడు బయటకు రాగానే అడిగాను "నీకు బుర్ర అనేది ఉందిరా?"

"అంత డైరక్టుగా అడిగితే ఏం చెప్పాలిరా?"

"ఏడవలేకపోయావ్! కోటిగాణ్ణి పట్నం పొమ్మంటావేం- పనంతా వాడిదయితే"?

వాడి ముఖం ఒక్కసారిగా పాలిపోయింది. "నిజమేరా! వాణ్ణి ఇంకెలా కాపాడాలో తెలీక, పట్నం పొమ్మంటున్నా!"

"అంటే?"

"అంటేనా? వాడు రేపు ఈ ఊళ్లో ఉంటే, రేపు ఈ పాటికి వాడు బతికే ఆశ లేదు. నువ్వు నమ్మవుగాని ఇది నిజంరా! మనిషిని మూఢ విశ్వాసాలనేవి ఎంతగా పాలిస్తున్నాయో, రక్తం ఎంత పలచనైపోయిందో నీకు తెలీదేమోగానీ నాకు తెలిసిపోయిందిరా!"

'అసందర్భం అనిపిస్తుందే గానీ ఇదంతా నిజంరా! రెండేళ్ల క్రితం రాయి తగిలిందని

ఆపేశామా! ఒక వారం క్రితం మా నాన్నకు కలొచ్చిందట. కలలో గంగాభవాని కనిపించి బలికోరిందిరా. కోడిని కాదు, మేకనూ కాదు, నరబలి, నరబలిరా! అర్థమైందా? ఆ బలైపోనున్న పశువుపేరు కోటిగాడు! నమ్ముతున్నావా?"

తల తిరిగిపోయింది. ఇంతటి ఘోరమా! మనిషిని మనిషి ఎలా చంపేయగలరు? వీడుండి కూడా ఇదంతా ఎలా జరగనిస్తున్నాడు?

"నేనేం చేయగలనురా? ఇప్పుడు చెప్పినదంతా నాకు తెలుసునని నాన్నకు తెలీదు. ఆ వెధవ బ్రాహ్మడొకడు, తందాన తాన అంటూ, మా నాన్న చెప్పింది నిజమేనంటూ కోటిగాడి చావుకు ముహూర్తాన్ని నిర్ణయించాడురా ఈ శాస్త్రిగాడు. ఇంతకన్నా ఇంకేం చెప్పను?" ఆవేశంతో మాటలేమి అంటున్నాడో వాడికే తెలీదు. కానీ నా కర్థం అవుతూనే ఉంది. వీడు చాలా సెన్సిటివ్, వీడి మనసు కిది గట్టిదెబ్బ. అందుకే అంత ఘాటుగా వస్తున్నాయి మాటలు.

"మనిషిలో విశ్వాసం, స్వామిభక్తి అనేవి ఉండాలి కానీ, కోటిగాడికి మాత్రం ఇంత ఉండకూడదురా! 'వద్దురా, రేపు రాకు' అని చెబితే – 'ఎలాగండీ, పనంతా నాదే కదా?' అంటాడు. 'నాకు పని చెయ్యాలని ఉందిరా' అంటే పకాలున నవ్వాడు. వాడిని మృత్యువు పిలుస్తూంటే నా మాట ఎందుకు వింటాడు?"

రాంబాబు హృదయంలోంచి వస్తున్న పలుకులివి. కానీ వాడేమీ చెయ్యలేడా? నమ్మను.

"పోనీ, ఒక పని చెయ్యలేకపోయావ్? ఎలాగోలా ఆపించేస్తే..."

"ఏమని ఆపించాలిరా? వీళ్ల దారుణమైన ఊహ నాకు తెలిసిందని వాళ్లకు తెలీదు. 'వద్దు, బావి తవ్వించవద్దంటే' కారణం చెప్పమంటాడు నాన్న. 'ఇదంతా నీ కోసమే గదరా. నీళ్ళు లేక ఎంత నష్టపోతున్నమో నీకు తెలీంది కాదు. ఈ బావి పూర్తయితే ఇక బంగారం పండిద్దాం' అంటాడు నాన్న. కానీ, ఆ రక్తపు కూడు నా కొద్దు అని ఎలా చెప్పాలిరా? నువ్వు నా స్నేహితుడివి. నాకు మనోబలం చేకూర్చవలసినవాడివి. అందుకే నిన్ను రమ్మన్నది!" అన్నాడు రాంబాబు.

రాంబాబుకు మనసులోనే జోహార్లు అర్పించుకున్నాను. ఆ తండ్రికి, వీడికి ఎంత తేడా! మనిషికీ, మనిషికీ, ఎంతటి వ్యత్యాసం! అయినా ఇంత దారుణంగా ఇంకొకడి హత్యని వీళ్లు ఎలా చేసేయగలరు? పైగా పూజ, ముహూర్తం అంటే కొంతమంది రానే వస్తారు. అంతమంది ఎదుటా...

కాకూడదు, ఈ ఊరు, నా సొంత ఊరు మరో కంచికచర్ల కాకూడదు; మరో ఒంగోలు కాకూడదు. వద్దు, వద్దు, నా ఊరు మరో ఖమ్మంగా మారిపోకూడదు.

ఇది నా ఊరు. నా ప్రాణం. నా తనువు, మనసు అంతా ఇదే. ఈ ఊరిలో ఇంత కల్మషం పెరగకూడదు. నా జన్మభూమి మలినం కాకూడదు. నా ఊళ్లో తిరగవలసింది గద్దలు, రాబందులు కావు. ప్రాణంతో మెలగవలసిన మనసులు, మనుషులు. అంతేగానీ... దేవుడా! రక్షించు నా స్వర్గాన్ని! నరకంగా మార్చి నాశనం చేయకు! ఇంతకన్నా ఇంకేమీ కోరను.

"రాంబాబూ!" నా మనసులో మెదిలిన ఊహా వాడితో అన్నాను.

వాడు నవ్వాడు. "నాకది అనిపించలేదనుకున్నావురా! పోలీసులు డ్రెస్‌లో వచ్చినా, మఫ్టీలో వచ్చినా, ముహూర్తం ఆగిపోతుందిరా! కొత్త వాళ్లముందు ఈ పని చేస్తారనే నీ ఊహ?"

నిజమే! "కానీ, రాంబాబూ, అందరి ముందు ఎలా జరుగుతుందిరా హత్య?"

"నువ్వొత్త పిచ్చివాడివిరా! ఊరు ఊరంతా కలిసి ఒకణ్ణి చంపటం ఎన్ని చోట్ల చూడలేదు మనం! అయినా, శిక్ష పడేది ఎవడికో, ఎప్పుడో... అంతేగానీ ఇప్పుడు..."

"ఇంతకీ ఎలా జరుగుతుందో?"

"చెబుతున్నాగా... రాయి మీదా దెబ్బ ఇక్కడ పడాలి అంటార్రా! మొదట గునపం దెబ్బ రాతి మీద పడితే ఆ తర్వాత రాయి పేలుస్తారు. కోటిగాడు గునపం దెబ్బ వెయ్యటానికి నూతిలో ఉంటాడు. పైనుంచి పొరబాటున రాయి పడుతుంది. ఆ రాయి సరిగ్గా కోటిగాడి మీద... ఇంతే, చాలా సింపుల్ యాక్సిడెంట్!".

ఎంత గొప్పగా ఉంది! హత్యే. కానీ హత్యకాదు. పొరబాటుట! వీళ్ళు చూపిస్తున్న ఈ తెలివి ఈ పద్ధతిలోగాక దేశోన్నతి కోసం అయితేనో? కానీ, మనకు ఉన్న తెలివిని చెడుకు ఉపయోగించుకోవటం తెలిసినంతగా, మంచికి ఉపయోగించుకోవడం తెలీదు. అది మన దౌర్భాగ్యం!

"నాలుగు రోజులయిందనుకోరా, కంటినిండుగా నిద్రబోయి, మనసు నిండుగా నవ్వుకుని ఆ వేళ నాన్న శాస్త్రితో చెబుతోంటే వినడమే. ఆ తర్వాత ఒక నిద్ర లేదు. కానీ, ఎలారా ఇది తప్పించటం?"

మంచితనం, మానవత్వం... రాక్షసత్వం, స్వార్థం... రెండూ రెండు పక్కల కత్తులు దూశాయి. ఇది యుగయుగాల సంఘర్షణ. తప్పదు! మనిషి ఈ మన్నుపై నిలిచినంతకాలం ఈ పోరాటం తప్పదు.

రాంబాబు ఇప్పుడెంతో ఎదిగిపోయాడు. తోటి మనిషి ప్రాణాలకు వాడిస్తున్న విలువ... ఛ, నాకు సిగ్గేసింది. నేనెంత అగాధాల్లో ఉన్నాను! వీడున్న స్థాయిని చేరుకోవాలంటే నాకు ఎన్నేళ్ల సంస్కారం కావాలి? ఈ జన్మ చాలదు, నిజం!

"ఏమిత్రా ఆలోచిస్తున్నావ్?"

"రేపు జరగనున్న పాపం గురించేనా!"

నవ్వాడు రాంబాబు. "పాపాలు ఎన్నో జరుగుతూనే ఉన్నాయిరా మనముందు కానీ, ఇదుంది చూశావ్... మా పొలం రేపెప్పుడో పండుతుందనుకుంటున్న బంగారానికి, ఈ వేళ ఒక బంగారు జీవితాన్ని నాశనం చేయబూనడం మాత్రం ఆపి తీరాలిరా! తప్పదు."

వాడిలో పట్టుదల ఉంది. కార్యం నిర్వహించి తీరాలనే సదుద్దేశం ఉంది. కానీ గెలవడానికి ఇవి చాలవు. బలమైన ప్రణాళిక అవసరం.

"ఔనురా, కానీ, ఎలా అన్నదే ఆలోచించాలి".

ఇద్దరమూ ఇంటికి చేరుకున్నాము. రాయుడుగారికి కొంత అనారోగ్యం ముదిరినట్లుంది.

కొంచెం అవస్త పడుతున్నాడు. రాంబాబు దగ్గరగా వెళ్లాడు. ఆయన ఆయాసంతో రొప్పుతున్నాడు. రాంబాబు క్షణం ఆలోచించాడు. "నాన్నా! బావి తవ్వడం ఆపేద్దాం, నాన్నా!".

నేనూ, రాయుడుగారూ... ఇద్దరం ఉలిక్కిపడ్డాం... కానీ, కారణాలు వేరు.

"నీ ఆరోగ్యంకన్నా ముఖ్యమా ఇది? తర్వాత ఎప్పుడో..." ఎంత సున్నితమైన అబద్ధం!

"వద్దొద్దురా! ఎంతో కాలంగా అనుకొంటున్నది రేపటికి జరగబోతోంది. దాన్ని ఆపే ప్రయత్నమేమీ వద్దు, నేనేమైనా సరే!" రాయుడు గారి పలుకుల్లో పట్టుదల ఉంది. 'అటు సూర్యుడిటు పొడుచుగాక, సముద్రములెన్నైనా ఇంకుగాక' అనే లెక్కలో ఉన్నాడు రాయుడు గారు.

"నువ్వన్నా చెప్పరా, నాన్నకింత అనారోగ్యంగా ఉంటే, ఇంట్లో శుభకార్యమా?" రాంబాబు బాధ నాకర్థం అయింది.

"వాడు అంటున్నదీ నిజమే, బాబాయ్‌గారూ! ముహూర్తం వాయిదా వేయిద్దాం..."

"ఆ పోనీ, ఆ పని చేద్దాం, నాన్నా!"

రాయుడుగారు ఉలిక్కిపడ్డట్లు అన్నారు "అసలా ఊహే రానీయద్దు, సరేనా?"

ఇంకేమీ అనలేకపోయాను నేను. రాంబాబు ముఖం పాలిపోయింది. సాయంత్రం దాకా ఇటు, అటు తిరుగుతూ గడిపాం ఇద్దరం. ఎంత తలలు బద్దలు కొట్టుకున్నా ఏమీ తోచటంలేదు. కోటిగాడికి చావు తప్పేటట్లు లేదు. ఏం చేయాలి? ఏం చేస్తే ఈ చావు తప్పుతుంది?

చీకట్లు చిమ్ముకొస్తోంటే వీరిగాడు వచ్చాడు. ఇక మంతనాలు. రాంబాబు అన్నాడప్పుడు: "చూడరా, కోటిగాడి ప్రాణానికి విలువ కడుతున్నార్రా వీళ్లు!"

నేను బాధతో మెలితిరిగిపోయాను.

ఉన్నట్లుండి మనసులో ఒక ఆలోచన తట్టింది. మర్నాడు ఉదయమే కోటిగాడు రాతిమీద దెబ్బవేసే సమయంలో, అక్కడ కోటిగాడి పక్కనే రాంబాబు ఉంటే రాయి వేసే ప్రశ్నే ఉండదు, రాంబాబు యజమాని కాబట్టి! కోటిగాడు బతకడం తథ్యం. ఈ పథకం విఫలం అనే ప్రశ్నేలేదు. రాంబాబు కొంత సంకోచించినా, చివరకు నేనూ, రాంబాబు నూతిలో దిగేందుకు సిద్ధపడ్డాం. ఇక గెలుపు మాదే! రాంబాబు నిద్రపోయాడో లేదో గానీ, నాకు మాత్రం హాయిగా నిద్రపట్టింది.

మర్నాడు నేను నిద్ర లేచేసరికి ఇల్లంతా కోలాహలంగా ఉంది. రాంబాబు తలంటు పోసుకున్నా, వాడి ముఖంలో దైన్యం కానవస్తూనే ఉంది. రాయుడుగారికేసి చూశాను. నిశ్చింతగా ఉన్నాడు. ఆ మనసనే మొగలిపొదల వెనుక తారాడుతున్న తాచుపాములు ఎవరికీ కనిపించవు. తన సువాసనలతో కాటు వేస్తోంది ఆ మనసు!

పాపం! కోటిగాడు!

కాదు, పాపం! రాయుడుగారు!

మనసు మంచి చెడుల మేలు కలయిక మాత్రమే కాదనీ, ఒక్కొక్కప్పుడు అది పిశాచాలు వంటి ఆలోచనలు సంచరించే మరుభూమి అని నాకీనాడే తెలుస్తోంది.

అయినా, మా పథకం పారి తీరాలి. ఒక నిండు జీవితాన్ని రక్షించామనే తృప్తితో ఈ జీవితకాలం అంతా బతకవచ్చు! ఈ ధ్యేయం లేని జీవితానికొక అలంకారం కావాలి! ఇక మా అదృష్టం. తలపెట్టింది మంచిపనే అయినా, చివరి వరకూ జయం లభిస్తుందనే ఆశ లేకపోతోంది.

కోటిగాడు వచ్చాడు. "దణ్ణాలు బాబయ్యా" అంటూ. జీవకళ వాడి సొమ్ము. రాయుడుగారు వాడికి, ఆ పనిని ఎలా చెయ్యాలో బోధపరుస్తున్నారు. 'ఇదిరా నీ చావుకు దగ్గర దారి' అంటూ. వాడు గంగిరెద్దులా తల ఊపటంతో ఒళ్లు మండిపోయింది నాకు. అయినా, ఏమనాలి?

ఎనిమిదిన్నరకు వీరిగాడు రావటంతో అందరం.. అంటే నేను, రాంబాబు, కోటిగాడు బయలుదేరాము. రాయుడుగారి పరిస్థితి బాగాలేక ఆయన, పిన్నిగారు రాలేదు, వీరిగాడు నూతిలో దిగి, దెబ్బ ఎక్కడ పడాలో కోటిగాడికి చెబుతున్నాడు. కోటిగాడు మృత్యుముఖంలోనే ఉన్నాడు.

పైన శాస్త్రిగారు యమభటుడిలాగా ఉన్నారు. ఆయన చదివే మంత్రాలు మరణశాసనాల్లా ఉన్నాయి. రాంబాబు అక్కడే కూర్చుని శాస్త్రి చెబుతున్నట్లు పూలు విసురుతూ, నీళ్లు చల్లుతూ ఉన్నాడు. రాంబాబు పక్కనే పెద్ద బండరాయి. అది పడితే చావు తప్పదు. పక్కనే వీరిగాడు.

తొమ్మిదయింది. రాంబాబు శాస్త్రినేదో అడిగాడు. ఆయన ముఖంబట్టి రాంబాబు శాస్త్రిని ఏమి అడిగి ఉంటాడో నాకర్థం అయింది. పట్టుపంచెతోనే పీటల మీంచి లేచాడు రాంబాబు. అందరి ముఖాలూ పాలిపోయాయి.

ఇద్దరం దిగాము. కోటిగాడి పక్కనే నిలబడ్డాం. నిమిషమంటే ఇంతసేపని నాకు ఇన్నాళ్లూ తెలీదు. గడియారంలో పెద్దముల్లు ఆగిపోయినట్లుంది.

ఇంకొక్క ఏడు నిమిషాలు.

మరో అయిదు నిమిషాలు. అంతే.

ఇంతలోనే పై నుంచి కేక వినపడింది. ఆ గొంతు ఎవరిదో గానీ, మా గుండెలు ఆవిరైపోయాయి. "అబ్బాయ్‌గారూ, అయ్యగారు పోయారండి!"

పట్టుపంచె అడ్డం పడుతున్నా, పరుగెట్టాడు రాంబాబు. వాడి వెనకనే నేనూ...

ఇంట్లోకొచ్చేసరికి - రాయుడుగారు చదువుతున్న పేపరు మడిచి పక్కనే పెడుతూ అడిగారు "అంతా అయిపోయిందిరా?"

మేము ఇద్దరమూ బిక్కచచ్చిపోయాము.

మా గుండెల్ని పిండేస్తున్నట్లుగా పెద్ద చప్పుడు, కేక, గోల.

రాంబాబు కళ్లలో నీళ్లు చిమ్ముతుంటే అన్నాడు- "ఆ కోటిగాడు మన కోసమే చచ్చిపోయాడు, నాన్నా!".

మంచి ఓడిపోవడం కళ్లారా చూసిన నేను, చెడు మాముందే చిరునవ్వులు చిందించటమూ చూశాను.

- ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక